



ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద గేట్ల నుంచి లీకవుతున్న నీరు (ఫైల్)

అమాత్యా.. ఇవిగో సమస్యలు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు అధ్వానంగా ఉన్నాయి. వంశధార, నాగావళి, మహేంద్ర తనయా, బాహుదా, నారాయణపురం తదితర ప్రాజెక్టులు, వాటి పరిధిలోని కాలువలు నిర్వహణకు నోచుకోవడం లేదు. ఎటుచూసినా కట్టలు కుంగిపోయి, గండ్లు పడుతూ, పూడిక పేరుపోయి, షట్టర్లు దెబ్బ తిని కనిపిస్తున్నాయి. దీనివల్ల ఆయకట్టు పరిధిలోని శివారు భూములకు నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయి. గత ఐదేళ్లూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఆధునికీరణకు ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం జిల్లాకు రానున్నారు. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుందని, ఈలోగా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- సాగునీటి ప్రాజెక్టులు బాగుపడేనా?
- అధ్వానంగా కాలువలు.. దెబ్బతిన్న షటర్లు
- ప్రమాదంలో గొట్టా బ్యారేజీ
- వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం
- నిర్వహణను గాలికొదిలేసిన వైనం
- ప్రస్తుత ప్రభుత్వంపైనే ఆశలు
- నేడు జిల్లాకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాక



గొట్టా బ్యారేజీ దిగువన పూర్తిగా దెబ్బతిన్న జడ్జిస్టోన్ ఎప్రాన్, సీసీ బ్లాకులు

నరసన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వంశధార కాలువల ద్వారా 2.08 లక్షల ఎకరాలకు సాగు అందాల్సి ఉంది. ఎడమ కాలువ ద్వారా హిర మండలం, సారవకోట, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 1.48 లక్షల ఎకరాలకు, కుడి కాలువ ద్వారా జలుమూరు, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పిడికెడు మట్టి పనులు కూడా చేయకపోవడంతో

(మిగతా 6వ పేజీలో..)



జలుమూరు మండలం టెక్కలిపాడు వద్ద వంశధార ఎడమ కాలువ ఇలా..



జమ్ము సమీపంలో నరసన్నపేట బ్రాంచ్ కాలువపై దెబ్బతిన్న షటర్లు

ఈ ఏడాదికి ఇంతేనా?

- సమస్యల వలయంలో గొట్టాబ్యారేజీ

హిరమండలం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హిరమండలం వద్ద వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజీ భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. దీనికి అనుసంధానంగా సుమారు రూ.1,750 కోట్లతో వంశధార రిజర్వాయర్‌ను నిర్మిస్తుండడంతో బ్యారేజీని నిర్లక్ష్యం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా బ్యారేజీ మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిర్వహణకు కనీసస్థాయిలో సిబ్బందిని కూడా నియమించడం లేదు. బ్యారేజీ దిగువన ఉన్న జడ్జిస్టోన్ ఏప్రాన్ పూర్తిగా దెబ్బతింది. రాళ్లు చెల్లాచెదురయ్యాయి. ఇంజనీరింగ్ నిపుణుల సూచన మేరకు జడ్జిస్టోన్ ఎప్రాన్‌స్థానంలో కాంక్రీట్ ఎప్రాన్ నిర్మించాల్సి ఉంది. బ్యారేజీ దిగువ భాగంలో మరమ్మతు పనులకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.8.5 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పది శాతం పనులు చేసి నిలిపివేశాడు. తరువాత అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం 25 శాతంలోపు జరిగిన పనులను నిలిపివేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి గొట్టాబ్యారేజీ పరిస్థితి దయనీయంగా మారింది. జగన్ సర్కారు ఎన్నికల సమయంలో రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసింది. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సూచనల మేరకు బ్యారేజీ దిగువన జడ్జి స్టోన్ ఏప్రాన్, సీసీ బ్లాకుల పునఃనిర్మాణానికి ఈ నిధులు సరిపోవని వంశధార అధికారులు కొత్తగా రూ.16.50 కోట్లతో ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఖరీఫ్ ప్రారంభానికి మరో రెండు నెలలే ఉంది. ఇప్పుడు నిధులు మంజూరు చేస్తే వర్షాకాలం ప్రారంభానికి కొంత మేర పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

పట్టని గేట్ల మరమ్మతులు..


గొట్టాబ్యారేజీ 24 గేట్లతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ కాలువల హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఆరేళ్లుగా కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఫలితంగా అవి మర్మతులకు గురయ్యాయి. బ్యారేజి ఎగువ ప్రాంతంలో నీరు నిల్వ చేసేందుకు గేట్లు దించినప్పటికీ లీకేజీల ద్వారా నీరు వృథాగా పోతుంది. చివరి సారిగా 2018లో గేట్లకు మరమ్మతులు చేశారు. ఆ తరువాత పట్టించుకోకపోవడంతో గేట్ల బేరింగ్‌లు, రోలర్లు దెబ్బ తిన్నాయి. ఇప్పటికైనా వాటిని బాగు చేయాల్సిన అవసరం ఉంది.

అచేతనంగా ఓపెన్ హెడ్ చానళ్లు..

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మహేంద్రతనయా, బాహుదా నదులు ప్రధాన సాగునీటి వనరులు. మరో 200 వరకూ చెరువులు ఉన్నాయి. పైడిగాం, బాహుదా ఓపెన్ హెడ్ చానళ్లు 11, వాటి పరిధిలో పదుల సంఖ్యలో గ్రోయిన్లు ఉన్నాయి. సీతసాగరం, పొత్రఖండ-శర్తలిపాలెం సాగరం, గంగా సాగరం, గోవిందసాగరం, సుంకిడి సాగరం వంటి సాగునీటి వనరులు ఉన్నాయి. కానీ, దశాబ్దాలుగా నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇవి మూలకు చేరాయి.

- బాహుదా నది ఇచ్ఛాపురం మండలానికి ప్రధాన సాగునీటి వనరు. దాదాపు 21 పంచాయతీలకు చెందిన 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు. ఈ నదిపై 11 చోట్ల (మిగతా 6వ పేజీలో..)

నేడు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల పర్యటన



శ్రీకాకుళం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవన రుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. విజయనగరం కలెక్టరేట్ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రోడ్డు మార్గంలో బయల్దేరి 3.30 గంటలకు టెక్కలి చేరు కుంటారు. అక్కడ 4.30 గంటల వరకు వంశధార ఎడమ ప్రధాన కాలువ (మదనగోపాల సాగరం బాలె న్సింగ్ రిజర్వాయర్)ను పరిశీలిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 6.30 గంటల వరకు అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారు. రాత్రి 7 గంటలకు విశాఖపట్నం తిరుగుపయనమవుతారు.

24 నుంచి ఉపాధ్యాయ మెడికల్ క్యాంపు

గుజరాతీపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఈ నెల 24, 25, 26వ తేదీల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకా కుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఈ క్యాంపు జరగనుందని చెప్పారు. ప్రిఫరెన్షియ ల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాల్సిన వారు తప్పనిసరిగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్యులతో పరిశీలన చేయించుకోవాలన్నారు. అనంతరం నూతన సర్టిఫికెట్లను తప్పనిసరిగా పొందాలని అన్నారు. వాటి ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ వర్తింపజేస్తామని తెలిపారు.

రాగుల కొనుగోలుకు ఏర్పాట్లు

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):జిల్లాలో రాగుల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ద్వారా కేవైసీ పూర్తిచేసిన రైతుల నుంచి రాగులను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి సంతబొమ్మాళి రైతుసేవా కేంద్రం వద్ద రాగుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇతర మండలాల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.4,290గా నిర్ణయించామన్నారు. గోనె సంచులు, కూలీ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించనుందని తెలిపారు. ధాన్యం సేకరణ తరహాలోనే రైతుసేవా కేంద్రాల ద్వారా రాగులను కొనుగోలు చేసి నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 77320 98637, 62818 39352 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

యాప్‌ల భారం తగ్గింది

- అన్ని సేవలూ ఒకే దానిలోనే..
- అందుబాటులోకి లీప్ యాప్
- ఉపాధ్యాయుల్లో హర్షం

6లో



రండి.. వ్యాపారం చేసుకోండి

- గ్రానైట్ పరిశ్రమకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు
- సూక్ష్మఖనిజ పాలసీలో మార్పులు
- ఒడిశా నుంచి తిరిగి వస్తున్న వ్యాపారులు
- వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు



మెళియాపుట్టి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన సూక్ష్మఖనిజ పాలసీతో గ్రానైట్ వ్యాపారులు నష్టాలు చవిచూశారు. దీంతో జిల్లాలో చాలా గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సూక్ష్మఖనిజ పాలసీలో మార్పులు చేసింది. ఈ మేరకు ఇటీవల జీవో నెంబర్ 57ను గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ జారీ చేశారు. దీంతో గ్రానైట్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూసివేసిన పరిశ్రమలను తిరిగి తెరిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇదీ జిల్లాలో పరిస్థితి

జిల్లాలో గతంలో 150 వరకు గ్రానైట్ క్వారీలతో పాటు 180 వరకు పాలిష్ యూనిట్లు ఉండేవి. ఒక్కొక్క క్వారీలో (మిగతా 8వ పేజీలో..)

- మెళియాపుట్టి మండలం మాకానాపల్లి గ్రామ సమీపంలోని 20 హెక్టార్లను ఓ గ్రానైట్ పరిశ్రమకు 15 ఏళ్ల కిందట లీజ్‌కు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రానైట్ పరిశ్రమ లీజ్‌ను తగ్గించడంతో పాటు వేధింపులు అధికమయ్యాయి. దీంతో పరిశ్రమ మూతపడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రానైట్ వ్యాపారులకు రాయితీలతో పాటు లీజ్ కాలం పెంపు, మినరల్ పాలసీలో మార్పులు తీసుకువచ్చింది. దీంతో మళ్లీ గ్రానైట్ పరిశ్రమలను ప్రారంభించేందుకు వ్యాపారులు ఆసక్తి చూపిస్తున్నారు.



- మెళియాపుట్టి మండలం దేగలపోలూరు రెవెన్యూ గ్రూప్‌లో గ్రానైట్ పాలిష్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఓ ప్రైవేట్ కంపెనీ నాలుగేళ్ల కిందట దరఖాస్తు చేసుకుంది. దీనికి అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఆ కంపెనీ ఒడిస్సా రాష్ట్రం గారబందలో పాలీష్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రానైట్ పరిశ్రమలు, పాలీష్ యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నవారికి వెంటనే అనుమతులు లభిస్తున్నాయి. దీంతో వ్యాపారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



రిమ్స్ ఆసుపత్రిలో కొనసాగుతున్న ట్రామాకేర్ ఆపరేషన్ థియేటర్

ట్రామాకేర్ ఎక్కడ?

- సమస్యలతో సతమతం
- వైద్యులు, సిబ్బంది పోస్టుల ఖాళీ
- పరికరాలు, బెడ్లు కొరత
- ఇదీ రిమ్స్‌లోని ట్రామాకేర్ సెంటర్ పరిస్థితి

అరసవల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉన్న ట్రామాకేర్ సెంటర్ సమస్యలతో సతమతమవుతోంది. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. సరిపడ వైద్య పరికరాలు, బెడ్లు లేవు. సర్జరీలు నిర్వహించేందుకు ఆపరేషన్ థియేటర్ కూడా అందుబాటులో లేదు. కొన్ని కేసులను విశాఖపట్నానికి రిఫర్ చేస్తున్నారు. ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి 12 ఏళ్లు దాటినా సిబ్బంది నియామకాలు గానీ, అవసరమైన ప్రత్యేక సదుపాయాలు గానీ కల్పించలేదు. నిజానికి రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి ట్రామాకేర్ సెంటర్‌లో వైద్యసేవలను అందిస్తారు. ఇది ఒక ప్రత్యేక విభాగంగా పనిచేస్తుంది. దీన్ని పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారి కూడా ఉండాలి. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని ట్రామాకేర్‌కు సంబంధించి ఐదుగురు సీఎంవోలు, ఇద్దరు జనరల్ సర్జన్లు, ఇద్దరు ఎముకల వైద్య శస్త్రచికిత్స నిపుణులు, న్యూరో శస్త్రచికిత్స వైద్యులు ఇద్దరు, మత్తు వైద్య నిపుణులు ముగ్గురు ఉండాలి. కానీ, ఇక్కడ అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. 21 మంది నర్సింగ్ సిబ్బందికి ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 19 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఎంఎన్‌వోలు, బార్డు బాయ్స్ 24 మంది వరకు ఉండాలి. కానీ, కేవలం ఇద్దరే పనిచేస్తున్నారు. 12 ఏళ్ల కిందట ట్రామాకేర్ సెంటర్ భవనం కోసం విడుదల చేసిన రూ.5కోట్ల నిధులను వేరే అవసరాలకు వాడుకున్నారు. దీంతో ప్రత్యేక భవన నిర్మాణం ప్రక్రియ ఆగిపోయింది.

శస్త్ర చికిత్సల నిర్వహణకు ఇబ్బంది..

రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలైన వారిలో కొందరికి మెదడుకు సంబంధించిన శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సి ఉంటుంది. రిమ్స్ ట్రామాకేర్‌కు రోజుకు కనీసం 20 నుంచి 25 మంది వరకు క్షతగాత్రులు వస్తుంటారు. వారిలో ప్రతిరోజూ సుమారు 20 మందికి చిన్నపాటి శస్త్ర చికిత్సలు, కనీసం రెండు నుంచి మూడు మేజర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. ట్రామాకేర్‌లో వైద్యులు లేకపోయినా రిమ్స్ డాక్టర్లు నిత్యం ఈ చికిత్సలను అందిస్తున్నారు. అయితే, ఈ సమయంలో వారికి ఒక్క సహాయకుడు కూడా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సరైన ఆపరేషన్ థియేటర్ కూడా అందుబాటులో లేదు. పరికరాలు కూడా సరిపడా లేవు. అలాగే, ఆరు వెంటిలేటర్లకు గాను రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మొబైల్ ఎక్స్‌రే యూనిట్ కూడా తరచుగా మొరాయిస్తుంది. దీంతో కొన్ని కేసులను విశాఖపట్నానికి రిఫర్ చేస్తున్నారు. అదే విధంగా 20 బెడ్లు మాత్రమే ఉన్నాయి. మరో 10 బెడ్లను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. మరో ఆపరేషన్ థియేటర్‌ను కూడా తాత్కాలికంగా అందుబాటులో ఉంచాలని, అప్పుడే మరిన్ని సేవలను అత్యవసర సమయాల్లో అందించగలమని వైద్యులు అంటున్నారు. ఈ విషయమై అధికారులు, నాయకులు దృష్టి సారించి ట్రామాకేర్ సెంటర్‌లో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

6లో

ఆక్రమణలు తొలగించారు.. పూడిక మరిచారు

- నీటి నిల్వపై ప్రభావం
- ఆందోళన చెందుతున్న చొక్కాకులబంద ఆయకట్టు రైతులు

6లో



యాప్‌ల భారం తగ్గింది

- అన్ని సేవలూ ఒకే దానిలోనే..
- అందుబాటులోకి లీప్ యాప్
- ఉపాధ్యాయుల్లో హర్షం



పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన లీప్ యాప్

నరసన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో యాప్‌లు బాధపడలేక ఉపాధ్యాయులు తలలు పట్టుకునేవారు. విద్యార్థుల హాజరుకు యాప్.. ఉపాధ్యాయుల ముఖహాజరుకు యాప్.. మధ్యాహ్న భోజనం అమలుకు యాప్.. మరుగుదొడ్ల నిర్వహణకు యాప్.. విద్యార్థుల మార్కుల అప్‌లోడ్‌కు యాప్.. ఇలా ఉపాధ్యాయులు ఇంతకాలం అల్లాడిపోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌లతో ఆపసోపాలు పడాల్సి వచ్చేంది. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి. కానీ వైసీపీ హయాంలో తీసుకువచ్చిన యాప్‌లతో బోధన పక్కన పెట్టాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్‌ల కష్టాలు నుంచి ఊరట కల్పించింది. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు నిత్యం పదికిపైగా యాప్‌లలో సమాచారం పంపాల్సి వచ్చేది. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమల్లో భాగంగా కూటమి ప్రభుత్వం యాప్‌ల భారం తగ్గించింది. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న నారా లోకేష్.. పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసువస్తున్నట్లు ప్రకటించారు. కొద్ది రోజుల్లో దీన్ని అమలు చేశారు.

● జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,955, ప్రాథమికోన్నత పాఠశాలలు 269, ఉన్నత పాఠశాలలు 414 ఉన్నాయి. వీటిలో 1,71,535 మంది విద్యార్థులు ఉండగా.. 10,914 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశ పెట్టారు. ఉపాధ్యాయులపై కక్షసాధింపులా వీటిని ప్రవేశపెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌లు కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు ఆందోళనలు చేపట్టినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు పదికిపైగా యాప్‌లతో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.

ఇక అన్నింటికీ లీప్ యాప్..

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. జిల్లాలో డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గతంలో ఉన్న టీచర్ అటెండెన్స్ యాప్ ఆటోమెటిక్‌గా లీప్‌గా మార్పు చేసింది. గతంలో వాడిన యూజర్ నేమ్.. పాస్‌వర్డులనే ఇప్పుడూ వినియోగించాలని సూచించింది. ఈ యాప్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వహణ చేయాల్సి ఉంది. అలాగే ఉపాధ్యాయులకు చెందిన పూర్తి సమాచారం కూడా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.



లీప్‌తో సమయం ఆదా..

పాఠశాలలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి వచ్చేవరకు పదిరకాల యాప్‌లతో కుస్తీ పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం లీప్ యాప్ ఆచరణలో పెట్టడం ద్వారా ఒకే సమయంలో విద్యార్థుల హాజరు, ఇతర సమాచారం పంపించేందుకు అవకాశం ఉంటుంది. సమయం ఆదా అవుతుంది. ఉపాధ్యాయుల బోధనపై దృష్టి సారించేందుకు దోహదం చేస్తుంది. హెచ్‌ఎంలకు లీప్ ఎంతో సహాయపడుతుంది.

-బమ్మిడి శ్రీరామమూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధ్యాయుల కష్టాలకు చెక్..

ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా యాప్‌లతో నానా అవస్థలు పడేవారు. లీప్‌తో ఉపాధ్యాయులు కష్టాలు తీరనున్నాయి. ఈ యాప్ సమర్థంగా పనిచేసేలా చూడాలి. పాఠశాలలకు హైస్పీడు ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు.

-తంగి మురళి, పీఆర్‌టీయూ, జిల్లా అధ్యక్షుడు

నూతన యాప్ వల్ల పనిభారం తగ్గింపు..

లీప్ యాప్‌తో ఉపాధ్యాయులకు పనిభారం తగ్గింది. అయితే మొదట్లో సాంకేతికపరమైన సమస్యలు రావడంతో కొద్దిపాటి ఆలస్యం అవుతోంది. అప్‌డేట్ అయిన తరువాత సాంకేతిక సమస్య ఏర్పడదు. పాత ఆండ్రాయిడ్ ఫోన్లకు ఈ యాప్ పనిచేయడం లేదు. ఆండ్రాయిడ్ 8 వెర్షన్‌లో లీప్ యాప్ వేగంగా పనిచేస్తుంది. ఈ యాప్ వినియోగంపై హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాము.

-సదాశివుని తిరుమల చైతన్య, డీఈవో



చొక్కాకులబందలో పూడిక తొలగించని దృశ్యం

ఆక్రమణలు తొలగించారు..
పూడిక మరిచారు

● నీటి నిల్వపై ప్రభావం ● ఆందోళన చెందుతున్న చొక్కాకులబంద ఆయకట్టు రైతులు

ఆమదాలవలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలోని కాళింగమన్నయ్యపేటలో గల చొక్కాకుల బందలో ఆక్రమణలు తొలగించినా, చెరువులోని పూడికలను విడిచిపెట్టడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సమయంలో వర్షాలు కురిసినా చెరువులో నీరు నిల్వపై ప్రభావం పడుతుందని, ఫలితంగా ఖరీఫ్‌లో సాగుకు అగచాట్లు తప్పవని రైతులు చెబుతున్నారు.

గ్రీవెన్స్‌లో విన్నవించినా..

సర్వే నెంబర్ 290లో చొక్కాకుల బంద ఐదెకరాల 60 సెంట్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. బందలో చుట్టుపక్కల కురిసే వర్షం ఆధారంగా నీరుచేరుతుంది. కాళింగమన్నయ్యపేటకు ఆనుకుని ఈ చెరువు ఆధారంగా 80 ఎకరాలకు నీరందుతోంది. గతంలో చెరువు ఆక్రమణకు గురి కావడంతో పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన జిల్లా అధికారులు 4 నెలల కిందట ఆక్రమణలు తొలగించిన విషయం విదితమే. కాని పూడికలను తొలగించడం మరిచిపోయారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించే సమయంలో వర్షాలు కురిశాయి. దీంతో ఆ తర్వాత పూడికలు తీస్తామని అధికారులు స్పష్టంచేసినా, నేటికీ తొలగించలేదని రైతులు చెబుతున్నారు. చొక్కాకుల బంద కింద ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులు సాగు చేస్తున్నారు. వేసవిలో పూడికలు తొలగించకపోతే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుకు కష్టాలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూడికలు తొలగించి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో విన్నవించినా సమస్యకు పరిష్కారం లభించలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు పూడికలు తొలగించకపోతే తామంతా కొంత మొత్తంలో డబ్బులను సేకరించి పూడికలు తొలగించుకుంటామని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.

నిధులు మంజూరైతే తొలగిస్తాం..

గతంలో టీడీపీ హయాంలో నీరు-చెట్టు పథకం కింద పూడికలు తొలగించేవారమని ఇరిగేషన్ జేఈ శివాజీ తెలిపారు. ప్రస్తుతం ఐదేళ్లగా ఎటువంటి పనులు చేపట్టడం లేదని చెప్పారు. నిధులు మంజూరైతే చెరువులో పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



బుడగట్లపాలెంలో స్థల పరిశీలన చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చేపలవేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ఇచ్చే 'భరోసా'ను స్వయంగా అందజేసేందుకు ఈ నెల 26న సీఎం చంద్రబాబునాయుడు బుడగట్లపాలెం విచ్చేస్తున్నారు. ఇందు కోసం అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ పర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు.. బుడగట్లపాలెం, డి.మత్స్యలేశం గ్రామాలను సోమవారం సందర్శించారు. సభా వేదిక స్థలాన్ని పరిశీలించారు. బుడగట్లపాలెం వద్ద సముద్ర తీరానికి 300 మీటర్ల దూరంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమీపంలోనే హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను కూడా పరిశీలించారు. ఎన్నికల హామీలో భాగంగా మత్స్యకార భరోసా రూ.20 వేలను ఈనెల 26న సీఎం చేతుల మీదుగా అందజేయనున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయిప్రత్యూష, తహసీల్దార్ బలగ గోపాల్, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, స్థానిక సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమాత్యా.. ఇవిగో సమస్యలు

(ఐదో పేజీ తరువాయి)

ఎడమ కాలువ పరిధిలోని శివారు ప్రాంతాలైన పోలాకి, కోటబొమ్మాళి, టెక్కలి, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఓపెన్‌హెడ్ చానల్స్ మీద ఆధారపడి ఉన్న కాలువ ద్వారా సాగునీరు అందక ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎడమ కాలువ, అనుబంధ కాలువల్లో సిల్ట్, గుర్రపుడెక్క పేరుకుపోయింది. చాలాచోట్ల షట్టర్లు లేవు. గత ఖరీఫ్‌లో వంశధార ఎడమ కాలువ పరిధిలో 35వేల ఎకరాల వరి పంట దెబ్బతింది. అదే విధంగా కుడి కాలువ పరిధిలోని శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో శివారు ప్రాంతాలకు సాగునీరు అందక వర్షంపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఆర్‌ఎంసీ కాలువల్లో పేరుకుపోయిన పూడికతో పాటు గుర్రపు డెక్క కారణంగా ఈ దుస్థితి ఏర్పడింది.

● నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆయకట్టు ద్వారా జిల్లాలో ఆమదాలవలస, పొందూరు, బూర్జ, ఎచ్చెర్ల, లావేరు మండలాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువలు కూడా ఆధునీకీకరణకు నోచుకోకపోవడంతో సాగునీరు అందక ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో ఈఏడాది పంటలు దెబ్బతిన్నాయి. ఇక ఉద్దానం ప్రాంతానికి సాగునీరు అందించే మహేంద్రతనయ, ఆఫ్‌షోర్ పనులు జరగగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం..

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. వంశధార, నాగావళి, ఆఫ్‌షోర్, నారాయణపురం, బాహుదా వంటి ప్రాజెక్టులు, వాటి పరిధిలోని కాలువల నిర్వహణను గాలికొదిలేయడంతో గత ఐదేళ్లు సక్రమంగా సాగునీరు అందక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలువల్లో అక్కడక్కడ పనులు చేసి పూడికలు తొలగించారు. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పుడే సాగునీటి వనరులకు సంబంధించి పనులు చేపట్టాలి. ప్రస్తుతం సాగునీటి సంఘాల నియామకం పూర్తయ్యింది. ఇటీవల చెరువులు, కాలువల మరమ్మతులకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ రెండు నెలల్లో వాటిని పూర్తిచేయాల్సి ఉంటుంది. లేకుంటే ఖరీఫ్‌లో ఇబ్బందికరమే.



కొళిగాం వద్ద పిచ్చి మొక్కల మధ్య రాజగాయి చానల్

అచేతనంగా ఓపెన్ హెడ్ చానళ్లు..

(ఐదో పేజీ తరువాయి)

ఓపెన్ హెడ్ చానళ్లను ఏర్పాటు చేశారు. గ్రోయిన్లను ఏర్పాటుచేసి నీటిని మళ్లిస్తున్నారు. అయితే దాదాపు ఓపెన్ హెడ్ చానళ్లు, గ్రోయిన్లు దెబ్బతినడంతో రైతులే సొంతంగా డబ్బులు వేసుకొని బాగుచేసుకోవాల్సి వస్తోంది. ఎగువ ప్రాంతంలోని ఒడిశాలో భలగబట్టి ప్రాంతంలో నదిపై ప్రాజెక్టును నిర్మించారు. దీని ఎత్తు 106 మీటర్లుకాగా.. ప్రాజెక్టు నిండనదే కిందకు నీరు విడిచిపెట్టరు. దీనికితోడు ఏపీ భూభాగంలో నదిలో దారుణంగా రెల్లి గెడ్డ ఉంది. చెత్త పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహ గమనానికి అడ్డంగా మారుతోంది.

పైడిగాం.. దయనీయం

మహేంద్రతనయా నదిపై సోంపేట మండలం బాతుపురం సమీపంలో నిర్మించిన పైడిగాం ప్రాజెక్టు 2018లో తితలీ తుఫాన్‌కు కొట్టుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్ప ప్రాజెక్టు నిర్మాణం మాత్రం చేపట్టలేదు. రూ.36 కోట్లతో ప్రాజెక్టును ఆధునీకరించనున్నట్టు ప్రకటించారు. కానీ, పనులకు మాత్రం ఇంతవరకూ మోక్షం లేదు. ఎగువ ప్రాంతంలో పురియాసాయి వద్ద ఒడిశా ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. దీంతో 185 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా.. కనీసం 40 క్యూసెక్కుల నీరు సైతం చేరడం లేదు. తూర్పు కనుమల నుంచి వచ్చే వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా లడ్డగుడ్డి వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తే.. ఆ నీటిని కాలువలకు మళ్లిస్తే మాత్రం అదనంగా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఇచ్ఛాపురం మండలంలో 9,150 ఎకరాల ఆయకట్టు, కంచిలి మండలంలో 12 వేల ఎకరాలు, సోంపేట మండలంలో 10,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందితేనే వరి పండేది. కానీ ఏటా సకాలంలో సాగునీరు అందక ఇబ్బందికర పరిస్థితులు తప్పడం లేదు. అందుకే ఈ ఏడాది వేసవిలోనే సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టాలని నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టిసారించాలి..



ఇచ్ఛాపురం నియోజకవర్గంపై గత వైసీపీ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఉన్న సాగునీటి వనరులు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వాల నుంచి ఎటువంటి కదలిక లేదు. ఏటా ఇదే పరిస్థితి. ఈ ఏడాది కనీస స్థాయిలో ఉభాలు జరగలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించాలి. వంశధార జలాలను ఇచ్ఛాపురం నియోజకవర్గానికి తెచ్చేందుకు కృషిచేయాలి.

-కాళ్ల దిలీప్, 22వ వార్డు కౌన్సిలర్, ఇచ్ఛాపురం

కూర్మనాథుని సన్నిధిలో విదేశీ భక్తులు

గార, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శ్రీ కూర్మనాథుడిని సోమవారం ఉదయం రష్యా దేశానికి చెందిన ఇస్కాన్ భక్తులు దర్శించుకున్నారు. శ్వేత పుష్కరిణిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామివారికి పూజలు చేశారు. పుష్కరిణి చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు.



భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తున్న విదేశీ భక్తులు

డీఐఈవోగా సురేష్‌కుమార్

శ్రీకాకుళం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారిగా (డీఐఈవో) ఆర్.సురేష్‌కుమార్ నియమితులయ్యారు. విజయనగరం జిల్లాలోని గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సీనియర్ ప్రిన్సిపాళ్లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సోమవారం ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులను జారీచేసింది. అలాగే పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడును విజయనగరం జిల్లా డీఐఈవోగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులను విడుదల చేశారు.

కూలీల కొరతకు.. యాంత్రీకరణే పరిష్కారం

● యువత వ్యవసాయరంగం వైపు రావాలి ● ఎన్జీరంగా వర్సిటీ పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ

● విజయనగరంలో ఉత్తర కోస్తా జిల్లాల వ్యవసాయశాఖ అధికారుల సమావేశం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చునని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టరు పీవీ సత్యనారాయణ తెలిపారు. ఉత్తర కోస్తాలోని అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ మండలి సమావేశం సోమవారం జడ్పీ సమావేశ భవనంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో భాగంగా తొలిరోజు ఖరీఫ్, రబీకి సంబంధించిన వివిధ పంటలు, కొత్త వంగడాలు, అధునాతన వ్యవసాయ పద్ధతులు వ్యవసాయ యాంత్రీకరణ, చీడపురుగుల నివారణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను వివరించారు. అనంతరం డాక్టరు పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్తర కోస్తాలోని నాలుగు జిల్లాల్లో వ్యవసాయ యాజమాన్య పనుల్లో నాణ్యమైన శిక్షణ అందిస్తామన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో వ్యవసాయోత్పత్తి పెరిగేందుకు మరింతగా వీలుందన్నారు. మొక్కజొన్న వంటి పంటల్లో ఇంకా వృద్ధి సాధించవలసి ఉందని చెప్పారు.

● విస్తరణ సంచాలకులు డాక్టరు శివన్నారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రైతుల పొలాల్లో మినీకిట్లు, ప్రదర్శన కేంద్రాలు, పరిశీలనలు రైతుల భాగస్వామ్యంతో ఇంకా పెరగాలన్నారు. రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

● వైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు భరతలక్ష్మీ మాట్లాడుతూ నువ్వులలో కలుపు యాజమాన్యం గురించి రైతాంగం గుర్తించాలన్నారు.

● నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ యువత వ్యవసాయం వైపు మళ్లాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పెరగాలని అన్నారు.

● శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు.

● వరి, అపరాలు, నూనెగింజలు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, మెట్ట వ్యవసాయం, కలుపుశాస్త్రం, యాంత్రీకరణ తదితర అంశాలపై ప్రధాన శాస్త్రవేత్తలు రైతుల నుంచి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.

● విజయనగరం జిల్లా వ్యవసాయాధికారి వీటి రామారావు మాట్లాడుతూ వ్యవసాయం ద్వారా మరింత అధికోత్పత్తి రావాలన్నారు. అభ్యుదయ రైతులు మాట్లాడుతూ అనుబంధ రంగాలైన మేకలు, పాడిపశువుల పెంపకం ద్వారా ఆదాయం పొందుతున్నట్టు వివరించారు.



ఖరీఫ్-రబీకి సంబంధించిన వివరాలను విడుదల చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

● రెండోరోజైన మంగళవారం ఉద్యానవన, పట్టు పరిశ్రమలకు సంబంధించి సమావేశం జరగనుంది. కార్యక్రమం అనంతరం ఖరీఫ్-రబీ (2025-26)కి సంబంధించిన ప్రణాళికను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు విడుదల చేశారు.

తొలి రోజు తీర్మానాలు ఇవే..

విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అభ్యుదయ రైతులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్న ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. వీటి సాధనకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.

తీర్మానాలు ఇవే..

● చిన్న కమతాలకు సంబంధించి యాంత్రీకరణ జరగాలి. ● వేసవిలో కూడా పంటలు పండించాలి. ఈ దిశగా రైతులను సమాయత్తం చేయాలి. ● యువత వ్యవసాయానికి వచ్చేలా అవగాహన కల్పించాలి. వారికి ఈ రంగంలో కూడా ఆదాయం ఎలా వస్తుందన్నదానిపై వివరించాలి. ● వ్యవసాయ రంగంలో నైపుణ్యం పెంచేందుకు యువత కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ● రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి ఉపయోగించే అన్ని పనులు నిర్వహించాలి.. చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.



తియ్యగా ఉంది.. తినేస్తాం

మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైతే రామచిలుకలు సందడిచేస్తాయి. వేకువ జామునే తోటల్లో వాలిపోతాయి. ముదిరిన, కోతకు వచ్చే మామిడికాయలను సగభాగం తిని విడిచిపెడతాయి. తియ్యగా ఉంటే మొత్తం పండును తినేస్తాయి. ఇలా చిలుకల జంట బాతుపురం వద్ద ఓ తోటలో మామిడిపండు తింటూ కనిపించాయి.

-వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)

కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా
విజేతలకు బహుమతుల పంపిణీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్ అండ్‌బైక్ రేస్ లక్కీడ్రా విజేతలకు బహుమతులను ఎచ్చెర్లలోని యూనిట్ కార్యాలయంలో సోమవా రం పంపిణీచేశారు. ప్రథమ బహుమతిగా మోటారు బైక్‌ను బల్లా రామకృష్ణ (బోయివీధి, వైఎస్ఆర్ స్ట్రీట్, విజయనగరం), ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్‌ను లంక కుమారి(బొబ్బిలి, విజయనగరం జిల్లా), తృతీయ బహుమతి టీవీని పేడాడ లలితకుమారి (చీమలవలస, ఆమదాలవలస మండలం)కి అందజేశారు.ప్రథమ బహుమతి విజేత రామకృష్ణకు మోటారు బైక్ విలువచేసే చెక్‌ను ఆంధ్రజ్యోతి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమ శంకరరావు, డీసీఎం పి.అనంత కుమార్ అందజేశారు. ద్వితీయ బహుమతి లంక కుమారి ఫ్రిజ్‌ను, తృతీయ బహుమతి పేడాడ లలితకుమారి టీవీని అందుకున్నారు.



విజేతలకు బహుమతులకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ సోమశంకరరావు, డీసీఎం అనంతకుమార్

తాబేళ్ల మృత్యువాతపై విచారణ: ఎమ్మెల్యే శంకర్

గార, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని క్షేత్రంలో తాబేళ్ల మృత్యువాతపై విచారణ నిర్వహిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత, దహనం జరిగిన ప్రదేశాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా తాబేళ్ల పార్కు నిర్వహణపై గ్రీన్‌మెర్సీ స్వచ్ఛందసంస్థకు చెందిన రమణమూర్తి, ఆలయ అధికారులను అడిగితెలుసుకున్నారు.తాబేళ్ల మృతదేహాలకు పోస్టు మార్టం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తాబేళ్ల మృతిచెందడం, దహనం చేసిన స్థలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ వై.భద్రాజీ, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ఎ.వెంకటేష్, పశువైద్య శాఖ జేడీ రాజశేఖర్, డీడీ రామమోహనరావు, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దన్, తహసీల్దార్ఎం.చక్రవర్తి పరిశీలించారు. అక్కడ 28 వరకు తాబేళ్ల మృతకళేబరాలు అధికారులు గుర్తించారు. వీటిలో ఎనిమిది తాబేళ్ల మృత కళేబరాలు పశువైద్యశాఖ అధికారులు పోస్ట్ మార్టం నిర్వహించడానికి తీసుకువెళ్లారు. పార్కులో ఉన్న తాబేళ్లను సంరక్షించడంపై తమశాఖ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా అటవీశాఖఅధికారి వెంకటేష్ తెలిపారు. ఇక్కడ భక్తులు, ఆలయ అధికారులు అభిప్రాయాలను తీసుకొని వివరాలు పంపి వారి ఆదేశాలు మేరకు తగిన చర్యలు తీసుకుం టామని చెప్పారు. అలాగే తాబేళ్ల మృత్యువాత పడడంతో దహనం చేసిన స్థలాన్ని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రధానకార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు, ప్రతినిధులు పరిశీలించారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న శంకర్

విద్యాభివృద్ధికి సహకరించాలి: కూన

ఆమదాలవలస,ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):పూర్వవిద్యార్థులు గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి కృషిచేసి విద్యాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మెట్టక్కివలస ప్రభుత్వోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం ముంబై లో విధులు నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ఏజీఎం వై.శ్రీనివాసరావు ఆ బ్యాంక్ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లస్ యూవీ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించా రు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీచైర్‌పర్సన్ తమ్మినేని గీతాసా గర్, ఎస్ఎంసీ చైర్మన్ దూసి సీతారాం, నాయకులు మొదలవలస రమేష్, ఎన్ని శ్రీదేవి, తంగి గురయ్య, రాజేంద్ర, మురళీధర్, బోర గోవిందరావు, రవీంద్రబాబు, ఎంఈవో రాజేంద్రప్రసాద్, హెచ్ఎంబి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ●ఊయల పథకం ద్వారా పసిపిల్లలను సంరక్షించుకోవచ్చని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు.ఆమదాలవలస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఆయన ఊయల కార్య క్రమాన్ని ప్రారంభిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పసిపిల్లలు వద్దనుకొనేవారు ప్రభుత్వఆసుపత్రుల్లో ఏర్పాటుచేసిన ఊయలలో వేయలని కోరారు.



మాట్లాడుతున్న రవికుమార్

●బూర్జ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి బూర్జలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగాప్రజలసమక్షంలో అధికారులతో సమీక్షించారు. కార్య క్రమంలో రామకృష్ణంనాయుడు, విశ్వ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యా ర్థినులకు ఉచితంగా టెస్ట్, నోట్ బుక్స్ అందజేశారు. ఇంటర్‌లో 979 మార్కులు సాధించిన బిందురెడ్డి, 454 మార్కులు సాధించిన వర్షితకు సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొ చ్చిన జీవో-117లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని తెలి పారు. బఅనంతరం విద్యార్థులు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, టీడీపీ పట్టణ కార్య దర్శి నందికిజాని, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి,జి.శేఖర్ పాల్గొన్నారు. కాగా ఇచ్ఛాపురానికి చెందిన నీలాపు భగవాన్ 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో తైక్వాండో అండర్-17 గ్రూప్‌లో 55కేజీల విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించడంతో విప్ బెందాళం అశోక్ అభినందించారు.



మాట్లాడుతున్న అశోక్

డీఎస్సీ పరీక్ష కాలవ్యవధి పెంచాలి

అరసవల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):డీఎస్సీ పరీక్షకు కాల వ్యవధిని 90 రోజులకు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకు ళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఎస్సీకి సంబంధించి వయో పరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు.రాష్ట్రంలో 27వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరాశ పరిచిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, నాయకులు అరవింద్, రామోజీ పాల్గొన్నారు.

చెట్టుపొదిలాంలో షిర్డీసాయి ఆలయం వార్షికోత్సవం

జి.సిగడాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపొదిలాంలో షిర్డిసాయి ఆలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం ప్రారంభమయ్యింది. ధర్మకర్త బూపతి అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మూడురోజుల పాటు బాబాకు అభిషేకాలు, హోమాలు, సామూహిక సత్యవ్రతాలు, అఖండ సాయినామ సంకీర్తన వంటివి నిర్వహించనున్నట్లు అర్జున్‌కుమార్ తెలిపారు. మండల స్థాయి భైటో భజన పోటీల్లో పెంట గ్రామానికి చెందిన సీతారామాంజనేయ భజన బృందానికి ప్రథమ, జి.సిగడాం భజన బృందాలకు ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి.

రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠకు శుభరాట

ఇచ్ఛాపురం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలకృష్ణాపురంలో నిర్మించిన రాధాకృష్ణ మందిరం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమనికి వేదపండితులు సోమవారం శుభరాట వేశారు.ఈ వేడుకలు మే రెండు నుంచి నాలుగో తేదీ వరకూ జరుగుతాయని గ్రామపెద్దలు తెలిపారు. రెండో తేదీన జలయాత్ర, నామయజ్ఞం, సింహద్వారం, ఆలయ ప్రతిష్ఠ కార్య క్రమా లు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో లోహిదాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.అలాగే బెల్లుపడలోశ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం ఘనంగా జరుగుతోంది. ఈమేరకు మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు.

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు సంబంధించి నాలుగో సెమిస్టర్ పరీక్షలు వర్సిటీలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. తొలి రోజు సైన్స్ పరీక్షలకు 351కు 347 మంది, ఆర్ట్స్ పరీక్షలకు 159కు 153 మంది హాజరయ్యారు. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పరీక్షలను పరిశీలించారు.

ఖాళీల భర్తీలో కొత్తవారికే అవకాశం: పీడీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పంచాయతీ స్థాయిలో ఖాళీగా ఉన్న క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్ల పోస్టుల భర్తీ ప్రక్రియలో గతంలో పనిచేసి తొలగించిన వారిని తిరిగి నియమించబోమని డుమా పీడీ బి.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్‌డీఎస్ నిబంధనల ప్రకారం ఒకసారి కాంట్రాక్టు రద్దయితే తిరిగి అర్హత ఉండదని పేర్కొన్నారు. ఖాళీల భర్తీకి కొత్త అభ్యర్థుల వివరాలను మాత్రమే అవకాశం కల్పించాలని మండలాభివృద్ధి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

● క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘ నాయకుల డిమాండ్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, 19సంవత్సరాల సర్వీసును ప్రామాణికంగా తీసుకుని, తత్సమాన జీత భత్యాలు చెల్లించాలని క్షేత్రసహాయకుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డచ్ బంగ్లా వద్ద సమావేశమై అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసనప్రదర్శన నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 28 నుంచి నిరవధికసమ్మె చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జి.ధర్మారావు, శ్యామలరావు, సుమారు 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లను ఆదుకోండి

అరసవల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్‌ను కాపాడి కేబుల్ ఆపరేటర్లను ఆదుకోవాలని ఏపీకేబుల్ ఆపరేటర్ల జేఏసీ నాయకులు గిరి,సభ్యులు కోరారు. శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో ఏపీ ఫైబర్ రూపంలో చంద్రబాబునాయుడు ప్రోత్సహించారని, 2019 వరకు 10.5లక్షల కనెక్షన్లతో సంస్థ నడిచిందని, కానీ గత ప్రభుత్వ హయాంలో అది నాలుగు లక్షలకు పడిపోయిందని తెలిపారు.ప్రస్తుతం ఏపీ ఫైబర్ మూతపడే స్థితికి చేరుకుందని చెప్పారు. సంస్థ మూతపడితే కోట్లరూపాయలు పెట్టుబడిపెట్టిన ఆప రేటర్లు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సమ స్యలపై ముఖ్యమంత్రిదృష్టి సారించి ఏపీ ఫైబర్‌ను, ఆపరేటర్స్‌ను కాపాడాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు.శ్రీకాకుళంలోని జడ్పీకార్యాలయం ఎదుట రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, మామిడి.భీమారావు, పాపయ్య, బొమ్మాళిబాలకృష్ణ, వంకల మాధవరావు, నన్నశెట్టి రాజశేఖర్ పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు

అరసవల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలు అరసవల్లి సబ్ పోస్టాఫీసులో అందుబాటులో ఉన్నాయని సబ్ పోస్టు మాస్టర్ కె.హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నువాగడలో వైద్యశిబిరం

కంచిలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నువాగడ ఆశ్రమ పాఠశాలలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబితా గొమంగో, స్కూల్ సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

రణస్థలంలో నిరసన

రణస్థలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో ఎస్సీలను గ్రామ బహిష్కరణ చేయడం అమానుషమని ఏపీ దళిత మహాసభ రణస్థలం మండలాధ్యక్షుడు టొంపల సూరప్పడు పేర్కొన్నారు. సోమవారం రణస్థలంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో దళితులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నీలయ్య, కుప్పిలి పైడిరాజు, గోవింద పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.సోమవారం జిల్లాలోని పలు గ్రామాల్లో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వపాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు.

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మన ఊరు-మన బడిని కాపాడుకోవాలని డొంకూరు జడ్పీపాఠశాల హెచ్ఎం సరోజిని కోరారు.డొంకూరు, చిన్న,పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం, సన్యాసిపుట్టుగ, కేశుపురంల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వపాఠశాలల ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరాం, కమలాకర్, శంకర్‌రెడ్డి, వెంకటేస్, నూకయ్య, వల్లభవరావు పాల్గొన్నారు.

●సరుబుజ్జిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో కంచరావు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చిగురువలసలో అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీ బెండి చిన్నారావు పాల్గొన్నారు. అలాగే మునిసిపాలిటీలోని 19వ వార్డు పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్‌యాదవ్ వాంబేకాలనీ, హడ్కోకాలనీలో ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఆయన వెంట హెచ్ఎం గోవిందరాజులు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి, టీడీపీ నాయకులు గొండు కరుణాకరరావు, రీసు చిరంజీవి ఉన్నారు.

●కంచిలి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మాధవి బెహరా, ఎంఈవో-2 చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 15మంది ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు.



కంచిలి: కత్తివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వైఎస్ విగ్రహం ధ్వంసంపై చొరవ తీసుకోవాలి

● దోషులను కఠినంగా శిక్షించాలి: జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

అరసవల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని భైరి గ్రామంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అణచివేయాలని కోరారు. కలెక్టర్, ఎస్పీలు తక్షణమే చొరవ తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

●ఆమదాలవలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):భైరి జంక్షన్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూల్చివేసిన ఘటన బాధాకరమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విగ్రహాన్ని నేలమట్టం చేసిన వ్యక్తులు తమ తప్పును తెలుసుకోవాలని తెలిపారు. ఎక్కడైతే నేలకూల్చారో, అదే చోట విగ్రహాన్ని తిరిగి ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని డీపీఎం పి.సత్యనారాయణ కోరారు.సోమవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.సత్యనారాయణను శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టులో పనిచేస్తున్న కమ్యూనిటీ డిజిటల్ ఫెసిలిటేటర్ సిబ్బంది, ఐసీటీఎన్ఎఫ్ఏ శివకృష్ణ సమక్షంలో కలిశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ పెన్షనర్ల అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. సోమవారం ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ పెన్షనర్లు ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలోసంఘ గౌరవాధ్యక్షుడు మోహన్‌రావు, లక్ష్మణరావు సంఘం కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు ఆర్.సత్యనారాయణ, కె.షన్ముఖరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కంచిలి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): కంచిలి జడ్పీ హైస్కూల్ 2008-09 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, సింహాచలం, సునీల్, హరి తదితరులు పాత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. పాఠశాలకు రూ20వేలు విలువ చేసే ప్లాస్టిక్ ఫ్లేవుడ్స్ డస్టర్లు, పెన్నులు అందజేశారు.

కంప్యూటర్ నైపుణ్యాలపై అవగాహన

గుజరాతీపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలపై అవగాహన సోమవారం కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, ఎస్.పద్మావతి, సీహెచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

సోంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదర్శపాఠశాలల్లో ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగంది. సోంపేటలో ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 419 మంది దరఖాస్తుచేసుకోగా 402మంది హాజరైనట్లు ఎంఈవో ఎస్.జోరాడు తెలిపారు.

●జి.సిగడాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 249 మంది ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోగా, 239 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 10 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ లెంక తెలిపారు.

మీ కోసంలో 154 వినతులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా 154 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడిక క్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు. ఈ సమావేశంలో వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారునితో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి 79 వినతులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 79 ఫిర్యాదుల అందాయి. ఈసందర్భంగా అదనపు ఎస్పీ కేవీ రమణ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీదారులతో ఏఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సకాలంలో అర్జీదారులకు చట్టపరిధిలో న్యాయం చేకూర్చాలని అన్ని స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లకు ఆయన ఆదేశించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగమయ్య మృతి


జంగమయ్య(ఫైల్)

హరిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బేతాళపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైపల్లి జంగమయ్య (84) సోమవారం మృతి చెందారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత మజ్జి తులసీదాసు, నారాయణరావుల ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొంది నేటి వరకు ఆ పార్టీలోనే కొనసాగారు. జంగమయ్య పోస్టుమాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతిపట్ల మందస కాంగ్రెస్ నాయకుడు హేమారావు చౌదరి, రైతు సంఘం నాయకుడు బెస్త కామేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీకి గాయాలు

నందిగాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శివరాంపురంలో సోమవారం ఉపాధి కూలీకి గాయాల య్యాయి. స్థానిక కొత్తచెరువులో పని చేస్తుండగా సబ్బి పాపమ్మ అనే కూలీ ప్రమాదానికి గురైంది. పనిచేస్తూ జారిపోవడంతో చేయికి గాయం కాగా వెంటనే 108 వాహనంలో పలాస ఆసుపత్రికి తరలించారు.

న్యాయవాది కృష్ణమోహన్ బీజేపీలో చేరిక

హరిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది యర్రగుంట్ల కృష్ణమోహన్ తన అనుచరులతో సోమవారం బీజేపీలో చేరారు. శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలరావు, అట్టాడ రవిబాబ్జి, ఉమామహేశ్వరి, రౌతు చిరంజీవిరావు, పార్టీ మండల అధ్యక్షుడు తెలుకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పునరావాస కాలనీలో విద్యుత్ వెలుగులు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు పునరావాస కాలనీలో విద్యుత్ సరఫరాను సంబంధిత అధికారులు సోమవారం ప్రారంభించారు. నౌపడ గ్రామంలో 58 ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్న ఆర్అండ్ఆర్ కాలనీకి వారం రోజుల్లో 160 విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్‌ను సరఫరా చేశారు. దీంతో 11కేవీ, ఎల్‌టీ లైన్లు కాలనీలో ఏర్పాటు చేశారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో 598 మంది నిర్వాసితులకు ఈ కాలనీలో లాటరీ ద్వారా ఐదు సెంట్లు చొప్పున ప్లాట్లు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఇటీవల టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి విష్ణుచక్రం గ్రామస్థులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఈ నెలాఖరులోగా విష్ణుచక్రం గ్రామస్థులను అక్కడికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఈ శంకరరావు, డీఈఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ దారుణం

టెక్కలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేయడం దారుణమని ఆ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం సమావేశం నిర్వహించారు. సాంఘిక బహిష్కరణకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు చల్ల రామారావు, కర్జిక గాంధీ, కుప్పిలి కామేశ్వరరావు, జర్జాన బాబూరావు తదితరులు కోరారు.

25న షిర్డీసాయి మందిరం 13వ వార్షికోత్సవం

టెక్కలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొనుసులకొత్తూరు గ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నట్లు అనువంశిక ధర్మకర్తలు వాకాడ జగదీశ్వరరెడ్డి, ఇందుమతి దంపతులు తెలిపారు. ఆరోజు ఉదయం కాగడహారతి, సర్వదర్శనాలు, గణపతి పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, మండలి పూజలు, 108 కలశాలతో క్షీరాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత


పోతయ్యకు వీల్ చైర్ అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

హరిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిన్నసువర్ణాపురం గ్రామానికి చెందిన అడ్డి పోతయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని రెండు కాళ్లు కోల్పోయి మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న సొండి పూడికి చెందిన మదర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు బాధితుడ్ని పరామర్శించారు. అతనికి అవసరమైన వీల్ చైర్, ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో అల్లుమల్లు నారాయణరావు, ఈశ్వరరావు, మల్లారెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై హర్షం


మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హిరమండలం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమల్లోకి రావడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి సంబరాలు చేశారు. ఈ మేరకు హిరమండలంలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు కంటి త్రినాథ్ మాదిగ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేపట్టారు. మూడు దశాబ్దాలపోరాటానికి ఫలితం దక్కిందన్నారు. గాంధీనగర్ మాదిగ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పలాస, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందించారు. వివిధ సమస్యలపై 14 వినతులు అందాయని తెలిపారు. తాగునీటి సమస్యలు అన్ని వార్డుల్లో ఉందని, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ఆయా వార్డుల ప్రజలు కోరారు.

రాకాశిగెడ్డ వంతెనకు మోక్షం

● రూ.5.65 కోట్లు మంజూరు ● త్వరలో పనులు ప్రారంభం


శిథిలావస్థలో ఉన్న రాకాశిగెడ్డ వంతెన

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు-మందస మండలాల ప్రజలు రాకపోకలకు అనుకూలమైన రాకాశిగెడ్డ వంతెన పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న తీరప్రాంత వాసుల కల నెరవేరనుంది. ఈ వంతెన నిర్మాణానికి రూ.5.65 కోట్లు నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికా రులు తీపి కబురు చెప్పడంతో ఆయా మండలాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన రాకాశిగెడ్డ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన పైనుంచి భారీ వాహనాలు సైతం రాక పోకలు సాగిస్తుంటాయని పూర్తిగా పాడవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికలకు ముందు ఒంకులూరు పరిసర గ్రామాల్లో ప్రచార సమయంలో రాకాశిగెడ్డ వంతెన పునర్నిర్మాణం చేపడతామని గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికై నూతన ప్రభుత్వంలో నిధుల మంజూరుకు చేసిన కృషి ఫలించడంతో హామీ నెరవేర్చుకున్నారని స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాగా వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర సమయంలో స్థానికులు రాకాశిగెడ్డ వంతెన పనులు చేపట్టాలని కోరగా అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అయినా ఆ ప్రభుత్వం ఐదేళ్ల ఈ వంతెన ఊసే ఎత్తలేదు. ఎన్నికలకు ముందు వంతెన నిర్మాణంపై ఆ పార్టీ నేతలు హడావుడి చేసినా ప్రజల నుంచి వారికి అనుకూలంగా స్పందన లభించలేదు.

పర్యాటకంగా..

రాకాశిగెడ్డపై వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం రాకపోకలకు అనువుగా ఉండి పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎర్ర దిబ్బలు వైజాగ్‌లోని ఎర్ర దిబ్బలను పోలి ఉంటాయని, సమీపంలో ఉన్న తోటూరు తీరం అభివృద్ధి చేస్తే పర్యాటకుల సందడి నెలకొనే అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. త్వరితగతిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే



సార్వత్రిక ఎన్నికల్లో రాకాశి గెడ్డపై వంతెన నిర్మాణం చేపడతామని గౌతు శిరీష ఇచ్చిన హామీని ఎమ్మెల్యే అయిన తరువాత నిలబెట్టుకున్నారు. గతంలో గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మెట్టూరు-ఒంకులూరును కలుపుతూ రాకాశిగెడ్డపై కాలిబాట నిర్మించారు. ఇప్పుడు ఎమ్మెల్యే వంతెన నిర్మాణానికి నడుంబిగించడం ఆనందంగా ఉంది. ఈ ప్రాంతీయులు వారికి రుణపడి ఉంటారు.

-దాసరి జేజేరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మెట్టూరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రాకాశిగెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ పక్రియ పూర్తయింది. భూమిపూజ చేసిన అనంతరం వంతెన పనులు ప్రారంభించి ఏడాదిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కాంట్రాక్టర్‌కు ఎన్‌వోసీ అందించాం.

-రామకృష్ణ, డీఈ, పంచాయతీరాజ్ విభాగం

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్: ఎంజీఆర్


సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బూరగాం గ్రామానికి చెందిన కృష్ణవేణి పొల్లాయ్‌కి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈమె మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యానికి ఆర్థికస్తోమత లేక సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఈ మొత్తం మంజూరు చేయించారు. అర్హతే ప్రాతిపదికన పేదలందరికీ సహాయక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీడి పంటకు గిట్టుబాటు ధర అమలు చేయాలి

కాశీబుగ్గ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమ వారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు జీడికి గిట్టుబాటు ధర కల్పన, జీడిబోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదన్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు నష్టపోతున్నారన్నారు. జీడిపప్పు ధర ఆకాశాన్నంటు తుంటే పిక్కల ధరలు మాత్రం పాతాళంలోకి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించి ప్రభు త్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ఎన్నికలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గణపతి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజపురంలో ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


ప్రతిష్ఠోత్సవం నిర్వహిస్తున్న రుత్వికులు

పోలాకి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజపురంలో నూతనంగా నిర్మించిన రామమందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు దార్లపూడి గణేష్ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ పంచగవ్యప్రాశన, దీక్షారక్షాధారణ, ప్రతిష్ఠ సంకల్పం, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రామమందిర నిర్మాణానికి స్థలం అందించిన సుంకాన తారకేశ్వరరావును గ్రామపెద్దలు, యువజన సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈనెల 23న విగ్రహ ప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రీ సర్వే సక్రమంగా చేపట్టాలి


రీ సర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

పలాసరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో గ్రంధి వెంకటేష్ ఆదేశించారు. కిష్టుపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేని సోమవారం ఆయన పరిశీలించారు. న్యాయబద్ధంగా, ఎవరికీ ఇబ్బందులు లేకుండా పైలెట్ ప్రాజెక్టును చేపట్టాలన్నారు. ఆయనతో పాటు సర్వేయర్లు చంద్రశేఖర్, గిరి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

నరసన్నపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలను ఈనెల 26వ తేదీలోగా సీఎస్ఈ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి మే 15వ తేదీలోగా ఒకటో తరగతిలో పేదల పిల్లలకు 25 శాతం ఉచితంగా అడ్మిషన్లు కల్పించాలని, ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాన్స్ గో బ్యాక్


నిరసన తెలుపుతున్న రైతుసంఘం ప్రతినిధులు

కాశీబుగ్గ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశానికి వచ్చిన సందర్భంగా వాన్స్ గోబ్యాక్ అంటూ రైతు సంఘం నేతలు నినాదాలు చేశారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. భారతదేశం అమ్మకానికి లేదన్నారు. అమెరికాతో అన్ని అసమాన స్వేచ్ఛా, వాణిజ్య ఒప్పందాల చర్చల నుంచి దేశం వైదొలగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు బాలాజీ, గణపతి, డిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

కొత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ పరిధిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పోస్టులను ఆది వాసీ గిరిజనులతో భర్తీ చేయాలన్నారు. పాడేరు ఐటీడీఏ ప్రాంగణంలో నిరుద్యోగ యువత శాంతి యుతంగా నిరసన తెలిపితే వారిపై పోలీసులు కర్కశంగా వ్యవహరించి ఈడ్చుకెళ్లడం దుర్మార్గ మన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వీల్ చైర్స్ పంపిణీ

కోటబొమ్మాళి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వీల్ చైర్లను సోమవారం ఎంఈవో ఎల్వీ ప్రతాప్ పంపిణీ చేశారు. దివ్యాం గులైన చిన్నారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, జడ్పీ బాలుర పాఠశాల హెచ్ఎం డి.గోవింద రావు, ఉపాధ్యాయుడు జి.పాపారావు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

కొత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం మండల కన్వీనర్ పనస రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ప్రత్యేక సమావేశం నిర్వహించార పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌ను పరిష్క రించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్‌కు మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించాలన్నారు. చిన్నారావు, రాజు, ధనుంజయ, రామారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి


నరసన్నపేట: ఉపాధి వేతనదారులకు అవగాహన కలిగిస్తున్న విద్యాశాఖాధికారులు

నరసన్నపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలని నరసన్నపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పోగోటి ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం కంబకాయి గ్రామంలో విద్యాశాఖాధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి వేతనదారులకు అవగాహన కలిగించారు. యూనిఫారం, నాణ్యమైన భోజనం, పుస్తకాలు, డిజిటల్ క్లాసులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పోగోటి అప్పలనాయుడు, బి.మహేంద్ర, కంబకాయి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రెడ్డికపేటలో హెచ్ఎం కొండాల జ్యోతి ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధన

పలాసరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన సాధ్యమని ఉపాధ్యాయులు అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో చేరికలు, హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాలలో అడ్మిషన్ల కోసం ర్యాలీ చేపట్టారు. ప్రైవేటు పాఠశాలల కన్నా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు ఉచితంగా యూనిఫారాలు, నోట్సు, పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. హెచ్ఎం ఎస్‌వీ రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పలాస రూరల్: బ్రాహ్మణతర్లాలో ర్యాలీ చేపడుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ప్రవేశానికి స్పెషల్ డ్రైవ్

నందిగాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి అన్ని తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. నందిగాం, పెద్దతామరాపల్లి, పాలవలస, లఖిదాసుపురం, దేవళభద్ర తదితర పాఠశాలల ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లల ఇళ్లకు వెళ్లి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు వారి తల్లిదండ్రుల నుంచి అనుమతులు తీసుకున్నారు.

గ్రామస్థుల సహకారంతో పాఠశాలలు బలోపేతం

హరిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేత మవుతాయని ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. లింబుగాం గ్రామంలో పాఠశాల వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. అర్ధంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవనం, వంటగది, ప్రహరీని గ్రామస్థుల సహకారంతో నిర్మించగా ఎంఈవో ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గున్నరాజు, మన్మథరావు, తాతారావు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


నందిగాం: పెద్దతామరాపల్లిలో ప్రచారం

న్యూస్ బాక్స్

భూసార పరీక్షలతో రైతులకు మేలు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూమి నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. సోమవారం సరియాపల్లి గ్రామంలో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార ఫలితాల ఆధారంగా అధికారుల సూచనలతో అవసరం మేరకు ఎరువులు వాడడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల కామేశ్వరావు, వ్యవసాయశాఖ సిబ్బంది ఎస్.డిల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో..

కొత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నవధాన్యాలను సాగు చేయడం ద్వారా రైతులకు మేలు చేకూరి అధిక ఆదాయం పొందవచ్చని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ సర్వీస్ సిస్టమ్ బృందం ప్రతి నిధులు మురళి, లోకేష్ అన్నారు. సోమవారం మాకవరం గ్రామంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు అంది వచ్చిన అవకాశాలను, సబ్సిడీపై అందిస్తున్న ఆధునిక పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, ధనలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పోలాకి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి సోమవారం పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 345 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 316 మంది హాజరయ్యారని, 29 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా పైడి ప్రవీణ, డిపార్ట్‌మెంట్ అధికారిగా రాంబాబు వ్యవహరించారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు పరిశీలించారు.

రండి.. వ్యాపారం చేసుకోండి

(5వ పేజీ తరువాయి)

30 నుంచి 50 మంది వరకు కార్మికులు పనిచేసేవారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రానైట్ వ్యాపారులకు ఎటువంటి రాయితీ లు లేకపోవడం, లీజు ఫీజ్‌ను పెంచడం, లీజు కాలాన్ని తగ్గించడం వంటి కారణాలతో 70 వరకు పరిశ్రమలు, పాలిష్ యూనిట్లు మూతపడ్డాయి. దీంతో ఇందులో పనిచేసిన కార్మికులకు ఉపాధి కరువైంది. గతంలో వైసీపీ నాయకులకు అనుకూలంగా ఉండే వారికి వేలం ద్వారా క్వారీ లీజులు మంజూరు చేసేవారు. దీనివల్ల ఆర్థికంగా బలంగా ఉండే వారికే లీజులు దక్కేవి. అదే విధంగా పెండింగ్ కొత్త దరఖాస్తులు, రెన్యువల్ దరఖాస్తులు, లీజుకు సంబంధించిన ఫీజులు కూడా అధికంగా పెంచారు. ఈ పరిస్థితిని మార్పుచేసి, వ్యాపారులను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2022 నాటికి పెండింగ్‌లో ఉన్న లీజ్ వివాదాలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను తీసుకువచ్చింది. ఆనాటి దరఖాస్తుదారుల్లో ఎవరు ముందు వస్తే వారికే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుచేసిన వారికి ఒక ఏడాది మాత్రమే ఫస్ట్‌కమ్.. ఫస్ట్‌సర్వ్ ప్రతిపాదనలు అమలు చేయనున్నారు. ఎల్‌వోఐ అందని వారికి అనర్హులుగా భావించనున్నారు. ఎల్‌వోఐ ఇచ్చే సమయంలో మూడురెట్ల వార్షిక డెడ్ రెంట్‌ను ఏడీఓఐ క్వారీ లీజుల రూపంలో చెల్లించాలి. 10 రెట్లుగా ఉన్న డెడ్‌రెంట్‌ను ఐదు రెట్లు తగ్గించారు. ఈ డబ్బులు 2-3 ఏళ్ల పాటు వాయిదా పద్ధతిలో చెల్లించటానికి అవకాశం ఇచ్చింది. ఇది వ్యాపారులకు కలిసిరానుంది. గతంలో గ్రానైట్ లీజు కాలం 20 ఏళ్లు ఉండేది. దీన్ని 30 ఏళ్లకు పెంచింది. పట్టా, డీకేటీ, అటవీ భూముల్లో లీజు మంజూరు చేయనున్నారు. కొవిడ్ కాలంలో ఖర్చుల నిమిత్తం 2021లో విధించిన కన్సిడరేషన్ డబ్బులను పూర్తిగా రద్దుచేసింది. కొత్త పాలసీలో టన్నేజ్ ఆధారిత సీనరేజ్ ఫీజు విధానం అమలు చేయనుంది. దీంతో అధికంగా గ్రానైట్ వ్యాపారం చేసేందుకు వ్యాపారులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.